సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 27 । మార్చి । 2025



దివ్యఖురాన్ అవతరించిన రాత్రి షబే-ఏ-ఖదర్

దివ్యఖురాన్ అతవరించిన రాత్రి షబే-ఏ-ఖదర్. గురువారం ముస్లింలు లైలతుల్-ఖదర్ పర్వదినాన్ని జరుపుకోనున్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహార్ శుక్ర॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.52
రాజంపేట	6.29	5.00
పీలేరు	6.31	4.53
మదనపల్లె	6.32	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 112 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	430	555
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 271.120 కిలోలు

న్యూస్‌రీల్

ఆర్‌ఐలకు పదోన్నతి

రాయచోటి: జిల్లా పరిధిలో పనిచేస్తున్న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు. బుధవారం ఈ మేరకు చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పీటీఎం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంఆర్‌ఐ టి బాలాజీ, జిల్లా డీఎస్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చాణక్య, కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జి మస్తాన్, కమలాకర్, ములకల చెరువు తహసీల్దార్ ఆఫీస్‌లో ఎంఆర్‌ఐగా పనిచేస్తున్న ఎస్ అనీషాలకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

రామాపురం: రైతులు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మండలంలోని బండపల్లె పంచాయతీ వెంకటరెడ్డిగారి పల్లెలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశిష్ట సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులని తెలిపారు. పంటల బీమా పథకం, ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయాధికారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్: ఎస్సీ ఎస్టీ అభ్యర్థుల ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సంక్షేమ,సాధికారత అధికారి సందప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్ఞానభూమి పోర్టల్‌లో ఈనెల 28వ తేదీలోపు ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు చేసుకోవాలని ఆయన తెలిపారు. జ్ఞానభూమి పోర్టల్ https://mdfc.apcfss.inలో వెబ్ ఆప్షన్ సర్వీసు ప్రారంభించామన్నారు. ఈనెల 28వ తేదీలోపు ఫేజ్-2 వెబ్ ఎంపికలను చేసుకోవాలన్నారు. షార్ట్ లిస్టు చేసిన అభ్యర్థులు తమ వెబ్ ఎంపికలను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం షార్ట్ లిస్టు చేసిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శిస్తామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కలకడ: జిల్లా సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు మంగిరి సాంబశివ డిమాండ్ చేశారు. బుధవారం కలకడలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, టీఎల్ వెంకటేశులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.ఏప్రిల్ 2,13 తేదీల్లో జిల్లాకేంద్రమైన రాయచోటిలో జరగనున్న జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చలో అందరూ పాల్గొనాలని కోరారు. చర్చకు సంబంధించిన గోడపత్రికలను కలకడలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలంటే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికనిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం త్వరగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు సురేష్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు జలాలుద్దీన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం



నేడే ఎన్నిక

- ఎన్నికలను నిలిపేయాలంటూ స్టేటస్‌కో కోసం టీడీపీ యత్నం
- చైర్మన్ ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆదేశించిన హైకోర్టు
- పోటీలో లేమంటూనే అడ్డగించే ప్రక్రియకు 'పచ్చ' పన్నాగం
- 47మంది జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులే...విప్ జారీ

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. గురువారం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో ఎన్నిక ప్రక్రియ కొనసాగనుంది. ఉదయం 10గంటలకు నామినేషన్ స్వీకరణ, 12గంటలకు నామినేషన్లు పరిశీలన పూర్తి, అనంతరం తుది జాబితా విడుదల చేయనున్నారు. 1గంటలకు నామినేషన్ ఉపసంహరణ చేపట్టనున్నారు. ఆపై పోటీలో ఉన్న అభ్యర్థుల మధ్య చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగించనున్నారు. జిల్లాలో 50 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా వారిలో పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి ఓ ప్రమాదంలో చనిపోయారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతూ రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జెడ్పీకి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులున్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా అందరూ వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులే కావడం విశేషం.



జిల్లా పరిషత్ సమావేశ భవనం

వైఎస్సార్‌సీపీ సభ్యులకు విప్ జారీ...

జిల్లా పరిషత్‌లో 47మంది జెడ్పీటీసీలకు వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేసింది. జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి సూచన మేరకు వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి ద్వారా సభ్యులకు విప్ జారీ చేశారు. విప్ జారీ చేసిన రిసిప్ట్ కాపీలు ఎన్నికల అధికారికి అందజేయనున్నారు. విప్ అందుకున్న సభ్యులంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. విప్ ధిక్కరిస్తే ఆయా సభ్యులు సభ్యుత్వం కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం సభ్యులంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు ముక్తకంఠంతో వెల్లడిస్తున్నారని సమాచారం. దాంతో వైఎస్సార్‌సీపీ ఆత్మవిశ్వాసంతో ఉంది. చైర్మన్‌గిరిని పార్టీ ఖాతాలో జమ చేసుకునేందుకు సన్నద్ధంగా ఉంది.

రామగోవిందురెడ్డిని వరించనున్న చైర్మన్ పీఠం



బ్రహ్మంగారిమఠం మండల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందు రెడ్డికి జెడ్పీ చైర్మన్ పీఠం దక్కనుంది. వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా ఆపార్టీ ప్రకటించింది. రెండు పర్యాయాలుగా బి.మఠం జెడ్పీటీసీగా ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమై రామగోవిందురెడ్డి అభ్యర్థిత్వాన్ని ఎంపిక చేశారు. అధినేత సూచనలు మేరకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు పార్టీ ప్రతినిధులు చైర్మన్ ఎన్నిక కోసం కంకణబద్ధులై ఉన్నారు. కలిసికట్టుగా ఎన్నిక ప్రక్రియ వ్యవహారం నడిపించేందుకు సన్నాహాలు చేస్తుండడం విశేషం.

తెలుగుదేశం పార్టీ ద్వంద్వనీతి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలో టీడీపీ ద్వంద్వనీతి ప్రదర్శించింది. సంఖ్యా బలం లేని కారణంగా ప్రజాతీర్పుకు గౌరవించి చైర్మన్ ఎన్నికలో పోటీలో లేమంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి ప్రకటించారు. వాస్తవాలు పరిశీలిస్తే అందుకు విరుద్ధమైన సంకేతాలు తెరపైకి వచ్చాయి. జిల్లా అధ్యక్షుడు పోటీలో లేమంటూనే మరో వైపు టీడీపీ జెడ్పీటీసీ జయరామిరెడ్డి ద్వారా ఎన్నికలను నిలుపుదల చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. బరిలో నిలిచే శక్తి లేకపోవడంతో చైర్మన్ ఎన్నిక నిలుపుదల చేసేందుకు కుట్రలు పన్నారు. టీడీపీ జెడ్పీటీసీతోపాటు మరో 7మంది తెలుగుదేశం పార్టీ వర్గీయులు హైకోర్టును ఆశ్రయించారు. చైర్మన్ ఎన్నిక అడ్డుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నించారు. స్టేటస్ కో తీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. చైర్మన్ ఎన్నిక నిలుపుదల చేసేందుకు, స్టేటస్‌కో ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడం విశేషం. సమయం లభిస్తే జెడ్పీటీసీ సభ్యులను వశపర్చుకోవాలనే దుర్బుద్ధితోనే హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. కాగా చైర్మన్ ఎన్నికకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించుకోవాలని హైకోర్టు ఆదేశిస్తూనే తుది ఫలితం హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉండాలని ప్రకటించింది.



జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఏర్పాటు చేసిన వేదిక

తాళ్లపాకలో ఘనంగా అన్నమయ్య వర్ధంతి



తాళ్లపాకలో చేపట్టిన నగర సంకీర్తన

రాజంపేట: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి ఉత్సవాలు బుధవారం తాళ్లపాక, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ప్రారంభమయ్యాయి. ముందుగా అన్నమచార్య ధాన్యమందిరంలో అన్నమయ్యకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

- తాళ్లపాక అన్నమాచార్యులను రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్నారు. ఈయన వెంట ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, సర్పంచ్ గౌరీశంకర్, తాళ్లపాక గ్రామస్తులు పాల్గొన్నారు.

రామయ్య బ్రహ్మోత్సవాలకు ఆకేపాటికి ఆహ్వానం



ఆకేపాటికి ఆహ్వాన పత్రికను అందించిన నటేష్‌బాబు

రాజంపేట రూరల్: ఏకశిలానగరం ఒంటిమిట్టలో నిర్వహించే శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు ఆహ్వానించారు. ఈమేరకు బుధవారం మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు నటేష్‌బాబు విచ్చేసి ఆహ్వాన పత్రికను ఆకేపాటికి అందించారు.

జిల్లాలో 15శాతం వృద్ధిరేటును సాధిస్తాం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రభుత్వం మార్గదర్శకత్వంలో జిల్లాలో 15శాతం వృద్ధిరేటును సాధిస్తామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో 3వ కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. 2025-26వ సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను, జిల్లాలో ముఖ్యమైన సమస్యలను ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. మామిడి పండ్ల రైతులకు ప్యాకేజింగ్‌కు ఒక రూపాయి సబ్సిడీ ఇవ్వడం ద్వారా రూ.9లు ఆదాయాన్ని సంపాదించగలుగుతున్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దిశానిర్దేశం మేరకు కార్యాచరణను రూపొందించుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

కనీసం 4 గంటలు పని చేయాలి

రాయచోటి టౌన్: జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతిరోజు కనీసం 4 గంటలకు తగ్గకుండా పని చేయాలని ఉపాధి హామీ పథకం పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం రాయచోటి రూరల్‌పరిధిలోని మాధవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన సేద్యపు నీటికుంటల పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలకు, అధికారులకు సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటలకే పనిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

వీరభద్రుడికి రూ.27,54,806 ఆదాయం

రాయచోటి టౌన్: రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 100 రోజులకు సంబంధించిన భక్తులు సమర్పించిన నగదు, కానులకు లెక్కించగా రూ.27,54,806 వచ్చిందని ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు.దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి సీ. శివయ్య నేతృత్వంలో లెక్కింపు నిర్వహించారు. అలాగే బంగారు నగలు 17.1 గ్రాములు, వెండి ఆభరణాలు 2.200 కిలోలు వచ్చినట్లు తెలిపారు. డబ్బును ఆంధ్ర ప్రగతి బ్యాంక్‌లో జమచేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

పౌల్ట్రీ.. పల్టీ





కొళ్లఫారాల్లో చనిపోయిన కోళ్లు

- వాతావరణ మార్పుతో మృతి చెందుతున్న కోళ్లు
- సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ
- నష్టపోతున్న రైతులు

గుర్రంకొండ: పౌల్ట్రీ పరిశ్రమ పల్టీ కొట్టింది. ఒకనాడు ఒక వెలుగు వెలిగిన పరిశ్రమ వరస వైరస్ దాడులతో నష్టాల బాట పడుతోంది. నాడు పౌల్ట్రీ రైతు పట్టిందల్లా బంగారమే.. మరి నేడు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత నెలలో వ్యాప్తి చెందిన బర్డ్ ఫ్లూ వ్యాధితో జిల్లాలో కోళ్ల పరిశ్రమ కుదేలైంది. ఈ నష్టం నుంచి రైతులు తేరుకోకముందే వాతావరణంలో వస్తున్న మార్పులతో జిల్లావ్యాప్తంగా అన్ని పౌల్ట్రీ పరిశ్రమల్లో వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో మెత్తం పౌల్ట్రీ ఫారమ్స్ 545 ఉన్నాయి. ప్రతిరోజు చనిపోయే కోడిపిల్లలు, కోళ్ల సంఖ్య రైతులను హడలెత్తిస్తున్నాయి. రోజు 5,450 నుంచి 10,900 వరకు కోళ్లు మృతి చెందుతున్నాయి.

కుదేలవుతున్న పౌల్ట్రీ పరిశ్రమ

ఈ ఏడాది వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బతింటోంది. కోళ్ల పెంపకంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నా చనిపోతున్నాయి. ఈ సంవత్సరం వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండడంతో పాటు ఉదయం వేళ మంచు, చల్లని వాతావరణం ఉంటోంది. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులకు కోళ్లు తట్టుకోలేక పోతున్నాయని, దీంతో ఫారాల్లోనే హఠాత్తుగా కుప్పకూలిపోతున్నాయని, మందులు, వాడినా రోగం అదుపులోకి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడికి కోళ్లను రక్షించుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు.

వేలల్లో చనిపోతున్న కోళ్లు

జిల్లాలో మొత్తం 545 పౌల్ట్రీ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం ఇందులో ప్రతిరోజు వేలల్లో కోళ్లు మృతి చెందుతున్నాయి. దీంతో రైతులు చేసేదిలేక చనిపోతున్న కోళ్లను ఎక్సకవేటర్‌లో గోతులు తీసి పూడ్చివేస్తున్నారు. కొంతమంది జనావాసాలకు దూరంగా పారవేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా కోళ్లు మృతి చెందుతున్నాయని రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టం

పౌల్ట్రీ పరిశ్రమను నమ్ముకొని జీవించే రైతులు ఈ ఏడాది భారీగా నష్టపోతున్నారు. కోళ్ల పరిశ్రమలకు పౌల్ట్రీ కంపెనీవారు కోడిపిల్లలను సరఫరా చేస్తుంటారు. రైతులు సుమారు 40 నుంచి 50 రోజుల వరకు కోడి పిల్లలను పెంచి తర్వాత వాటిని బరువు తూచి పౌల్ట్రీ కంపెనీ వారికి అప్పగిస్తుంటారు. ఇన్ని రోజులు కోళ్లు తినే ఫీడ్, వైద్య ఖర్చులు కంపెనీవారే భరిస్తుంటారు. కోడిపిల్లలను రైతులకు ఇచ్చే సమయంలో ప్రతి వెయ్యి పిల్లలకు అదనంగా 50 కోడిపిల్లలను కంపెనీ ఇస్తుంది. పదివేళ్ల కోళ్లు పెంచే రైతుకు అదనంగా 500 కోడిపిల్లలు ఇస్తుంటారు. ఇందులో రోగాలు, వాతావరణలో మార్పులతో కోడిపిల్లలు చనిపోతుంటాయి. అదనంగా ఇచ్చే 500 కోడిపిల్లలు చనిపోతే రైతు ఎటువంటి నష్టం భరించాల్సి ఉండదు. అయితే అదనంగా చనిపోయే కోళ్లతో వచ్చే నష్టాన్ని రైతే భరించాల్సి ఉంటుంది. దీంతో వారికి నష్టాలు తప్పడం లేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను 10 వేల కోళ్లు పెంచే ఫారం నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కోళ్లు 15 రోజుల వయసులో ఉన్నాయి. వాతావారణంలో వస్తున్న మార్పులు కారణంగా కోళ్లకు సోకే రోగాలు అదుపులోకి రావడం లేదు. మందులు, ఇంజెక్షన్లు వేసినా ఫలితం లేకుండా పోతోంది. దీంతో కోళ్లు చనిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. - రమణమ్మ, పౌల్ట్రీరైతు, దానంవారిపల్లె


జాగ్రత్తలు తీసుకోవాలి




ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. కోడిపిల్లలు ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా 10 రోజుల లోపు స్టేజీలో ఉన్న కోడి పిల్లలు ఎక్కువగా చనిపోతున్నాయి. ఇందుకోసం పౌల్ట్రీ రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. రేకులషెడ్లపై పచ్చని ఆకులు, టెంకాయపట్టలు, వేసుకోవాలి. అవసరమైన సమయంలో వైద్యసేవలు అందిస్తూ కోళ్లను సంరక్షించుకోవాలి. - సునీల్, పశువైద్యాధికారి, గుర్రంకొండ

అన్నమయ్యపై టీటీడీ చిన్నచూపు!

- పేరుకే రాజంపేట నియోజకవర్గం
- రామయ్య బ్రహ్మోత్సవాల్లో వైఎస్సార్ జిల్లా యంత్రాగానికి పెద్దపీట
- ఈసారైనా టీటీడీ తన వైఖరి మార్చుకోవాలంటున్న రాజంపేట వాసులు





రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయం

రాజంపేట: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా విభజనసెగ వెంటాడుతోంది.అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్టలోని కోదండరామాలయం వైఎస్సార్‌జిల్లాలో ఉన్న తరుణంలో అన్నమయ్య జిల్లా పరంగా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు ఉన్నాయి.పేరుకే రాజంపేట నియోజకవర్గం అని, బ్రహ్మోత్సవాల్లో వైఎస్సార్ జిల్లా యంత్రాంగానికి టీటీడీ పెద్దపీట వేస్తోందని ఇక్కడి వారి భావన. వైఎస్సార్ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీని భాగస్వాములను చేయకుండా టీటీడీ వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.

టీటీడీలో విలీనం కాకముందునుంచి..

ఒంటిమిట్ట కోదండరామాలయం టీటీడీలో విలీనం కాకముందు నుంచి బ్రహ్మోత్సవాలను రాజంపేట నియోజకవర్గ యంత్రాంగమే విజయవంతంగా నిర్వహిస్తోంది. కొత్త జిల్లా ఏర్పాటు క్రమంలో నందలూరు ఒంటిమిట్ట మండలాలు వైఎస్సార్ జిల్లాలో విలీనమయ్యాయి. దీంతో టీటీడీ కూడా తన దిశను మార్చుకుందన్న అపవాదును మూటకట్టుకుంది. స్థానికులతో పాటు రాజంపేట నియోజకవర్గంలోని ఆరుమండలాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు బ్రహ్మోత్సవాల్లో చోటు లేకుండా చేశారు. ఉభయ వైఎస్సార్ జిల్లాకు చెందిన వారి భాగస్వామ్యంతో చేస్తే ఎలాంటి బేధాభిప్రాయాలు రావన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాములోరి కల్యాణోత్సవం సమయంలో పాసులు, ఇతర అనుమతులు విషయంలో అన్నమయ్య జిల్లాకు టీటీడీ మొండిచెయ్యి చూపిస్తోంది. ఇది సరైన విధానం కాదని, రామాలయం మాది.. పెత్తనం వారిదా అన్న అభిప్రాయం అధికారులు, భక్తులలో కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా టీటీడీ ఒంటిమిట్ట రామాలయం ఉత్సవాల నిర్వహణ విషయంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు. ఏప్రిల్ 6 నుంచి 14 వరకు జరిగే శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణలో లా అండ్ అర్డర్ పగ్గాలు కడప పోలీసులకే టీటీడీ , ప్రభుత్వం అప్పగిస్తోంది. ఉభయ వైఎస్సార్ జిల్లాలకు ఒంటిమిట్ట రామాలయం ప్రధానమైనప్పటికీ లా అండ్ ఆర్డర్ విషయంలో అన్నమయ్య జిల్లా ఖాకీ పెద్దల భాగస్వామ్యం ఉండకపోవడం గమనార్హం. టీటీడీ కడప పోలీసువ్యవస్థకే ప్రాధాన్యత ఇవ్వడంపై జిల్లా పోలీసువర్గాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి.

జిల్లా యంత్రాంగానికి భాగస్వామ్యం కల్పించాలి



ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో టీటీడీ అన్నమయ్య జిల్లాపై చిన్నచూపు చూపుతోంది. రాములోరి కల్యాణోత్సవంలో అన్నమయ్య జిల్లా యంత్రాంగానికి భాగస్వామ్యం కల్పించాలి. ఆలయం రాజంపేట నియోజకవర్గంలో ఉంటే, ఉత్సవాల నిర్వహణ విషయంలో జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం సరికాదు.

- కెఎంఎల్ నరసింహా, కన్వీనర్, ఆల్ ఇండియానేషనల్ బీసీ ఫ్రంట్

పూర్వ సంప్రదాయాన్ని కొనసాగించాలి



పూర్వం నుంచి ఒంటిమిట్ట కోదండ రాముని బ్రహ్మోత్సవాల్లో రాజంపేటకు చోటు కల్పించేవారు. ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా యంత్రాంగానికి కల్యాణోత్సవం నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. స్థానికులనే పదం లేకుండా చేయడం సరికాదు. ఈ సారి జరిగే కల్యాణోత్సవంలో పూర్వ సంప్రదాయాన్ని టీటీడీ కొనసాగించాలి.

- మర్రి కళ్యాణ్, ఎస్‌ఆర్‌ఐ, రాజంపేట



క్లుప్తంగా

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై దాడి

మదనపల్లె : పట్టణంలోని తంబళ్లపల్లె గ్రామీణ నీటిసరఫరా విభాగం డీఈ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ములకలచెరువు ఏఈపై దాడి చేశారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఓ మహిళా ఉద్యోగిని ఏఈ అసభ్యంగా దూషించాడనే కారణంతో ఆమె కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి దాడి చేశారు. ఈ విషయం పట్టణంలో దావానలంలా వ్యాపించడంతో మీడియా ప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లగా, దీంతో అక్కడ ఉన్న అధికారులు, అలాంటిదేమీ జరగలేదని సమాధానమిచ్చారు. కొందరు మాత్రం చిన్నపాటి గొడవ, సర్దేశాం. ఇంతటితో వదిలేయండని చెప్పడం గమనార్హం. అయితే ఉన్నతాధికారులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా లోలోపలే సర్దుబాటు చేసి పంపించేసినట్లు తెలిసింది.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

– ఇద్దరిపై కేసు నమోదు

మదనపల్లె : మండలంలోని సీటీఎం దళితవాడలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, సారా విక్రేత యర్రబల్లి హరీష్(27)ను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. ఇదే కేసులో నాటుసారాను హరీష్‌కు సరఫరా చేసిన వాయల్పాడు మండలం దిగువమేకలవారిపల్లెకు చెందిన మల్లికార్జున(27)పై కేసు నమోదు చేశామన్నారు. హరీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, మల్లికార్జునను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డార్కస్, జబీవుల్లా, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరనాగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, శివరాణి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపంతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కలిచెర్ల పంచాయతీ పుట్టన్నగారిపల్లెకు చెందిన భాస్కర భార్య గిరిజమ్మ(25) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవ పడింది. మనస్థాపం చెంది ఇంట్లో నిల్వ ఉంచిన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మందలించారని..

మదనపల్లె : మద్యానికి బానిసకావద్దని మందలించడంతో మనస్థాపానికి గురైన యువకుడు నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. సిరికల్చర్ కాలనీకి చెందిన ముక్తియార్ కుమారుడు అవాజ్ (20) పట్టణంలోని సెల్‌షాపులో పని చేస్తున్నాడు. రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో ఇంట్లోని పెద్దలు పద్ధతి మార్చుకోవాలని మందలించారు. దీంతో మనస్థాపం చెందిన అవాజ్ పెట్రోల్ మీద పోసుకుని నిప్పటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఐదుగురిపై కేసు నమోదు

మదనపల్లె : మద్యం మత్తులో ఘర్షణ పడిన ఇరువర్గాల్లోని ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు టు టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని స్థానిక నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి ఆలయం వద్దను ఉన్న శశి (25)శ్రీకాంత్(23)లు అదే ప్రాంతానికి చెందిన శివానాగ(50) లోకేష్ (37), రాజేష్(25)లతో మద్యం మత్తులో గొడవపడ్డారు. గొడవల్లో భాగంగా ఇరువర్గాలు కర్రలతో దాడులు చేసుకున్నారు. దాడిలో ఐదుగురు గాయపడగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గొడవ ఘటనపై ఇరువర్గాలు బుధవారం టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా ఇరువర్గాల్లోని ఐదుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దివ్యఖురాన్ అవతరించిన రాత్రి..

షబ్-ఏ-ఖదర్



ముస్లింలకు శుభప్రదమైన, పుణ్యప్రదమైన రాత్రి షబేఖదర్ రానేవచ్చింది. ప్రతి ఏడాది రంజాన్ పండుగ ఆగమనానికి ముందు షబేఖదర్ వస్తుంది. షబేఖదర్‌ను సతామి, లైలతుల్‌ఖదర్ అని కూడా పిలుస్తారు. షబే అంటే రాత్రి, ఖదర్ అంటే గౌరవం అని అర్థం. షబేఖదర్ రోజున జాగరణతో ప్రార్థనలు చేస్తే వెయ్యి నెలలకుపైగా అల్లాహ్ స్మరణతో ప్రార్థనలు చేసినంత పుణ్యం లభిస్తుందని మౌల్వీలు చెబుతున్నారు

- నేడు సతామి పర్వదినం
- విద్యుత్ దీపాల అలంకరణలో మసీదులు
- ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం

మదనపల్లె సిటీ/రాజంపేట టౌన్ : దివ్యఖురాన్ అతవరించిన రాత్రి షబే-ఏ-ఖదర్. దీనిని పురస్కరించుకుని గురువారం ముస్లింలు లైలతుల్-ఖదర్ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ పండుగను వ్యవహారిక భాషలో సతామి పండుగ అని కూడా పిలుస్తారు. లైలతుల్ ఖదర్.. వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, దువా, ప్రత్యేక ప్రార్థనలు చేసిన పుణ్య ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు ×బడీరాత్‌ (పెద్దరాత్రి) అని కూడా అంటారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి ఇషా నమాజ్ నుంచి తెల్లవారు జామున సహెరి వేళ వరకు ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. పగలంతా రోజా ఉంటారు. రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తరావీహ్ నమాజ్, బయాన్, హదీస్, ఖురాన్ తిలావత్, సలాతుత్, తబ్బీ, తహజీద్ నమాజ్, దువా ఇలా రేయంతా అల్లాహ్ ఆరాధనలో గడుపుతారు. తమ కష్ట, నష్టాలు విన్నవించుకుంటారు. వాటిని దూరం చేయాలని వేడుకుంటారు. పాపాలను దహించాలని మొరపెట్టుకుంటారు. తోబా, అస్తగ్ ఫిరుల్లా చదివి తప్పుల నుంచి క్షమాపణ కోరి, నరకం, నరకాగ్ని నుంచి ముక్తి కోరుతారు. ఒక తల్లి ప్రేమ కంటే డెబ్బై రెట్లు అధికంగా ప్రేమ చూపే అల్లాహ్..పిల్లల తప్పులను తల్లి క్షమించినట్లు అనంత కరుణామయుడు కూడా మనుషుల మొర విని కరిగిపోతాడు. చేసిన పాపాలు, తప్పులను క్షమించి ముక్తి కలిగిస్తాడు.


ఈ రాత్రి జాగరణ చేస్తే ఒకటి రెండు కాదు ఏకంగా వెయ్యి నెలలకు పైగా ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్య ఫలాలు లభిస్తాయి. అదే లైలతుల్ ఖదర్ విశిష్టత అని మౌల్వీలు, ఉలేమాలు తెలిపారు.

ఒక రోజు జాగరణ.. వెయ్యి మాసాల పుణ్యఫలం

ప్రవక్త మహమ్మద్ సొల్లెలాహు అలైహివసల్లం కంటే పూర్వం ఉన్న ప్రవక్తల కాలంలో మనుషుల ఆయుష్షు వందల ఏళ్లు ఉండేదని హదీసుల ద్వారా తెలుస్తోంది. నాటి ముస్లింలు వందల ఏళ్లు ఆధ్యాత్మికంగా గడిపి స్వర్గానికి మార్గం ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఆయుష్షు రానురాను మరింత తగ్గుతుందని, నాటి ప్రవక్తల కాలంలో ఉమ్మత్ సంపాదించుకున్న పుణ్యంతో పోల్చితే తన ఉమ్మత్ (ప్రవక్త సూచించిన మార్గాలను అనుసరించే మనుషులు) పుణ్యం తక్కువగా ఉంటుందని భావించారు మహమ్మద్ ప్రవక్త.ఈ విషయంపై అల్లాహ్‌ను వేడుకుంటూ .. ఆయుష్షు తక్కువగా ఉన్న తన ఉమ్మత్‌కు అధికంగా పుణ్యం లభించే మార్గాలు చూపినా మహమ్మద్ ప్రవక్త సంతృప్తి చెందకపోవడంతో చివరకు లైలతుల్ ఖదర్‌ను తెస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించారు. ఈ లైలతుల్ ఖదర్ రాత్రంతా జాగరణ చేసి, ఆధ్యాత్మికంగా గడిపిన వ్యక్తికి వెయ్యి నెలలకు పైగా ప్రార్థనలు చేసిన పుణ్యం ఇవ్వనున్నట్లు చెబుతారు. ఈ రాత్రి దైవదూతలు దివి నుంచి భూమిపైకి వచ్చి ఆధ్యాత్మికంగా గడిపే వారితో కరచాలనం చేసుకుని 'అల్లాహ్ మీ ప్రార్థనలు అంగీకరించారని' అభినందిస్తారని దివ్య ఖురాన్ చెబుతోంది.

చివరి దశకంలోనే లైలతుల్ ఖదర్..

రంజాన్‌లోని ఆఖరి అష్ర (చివరి పది రోజులు)లోనే లైలతుల్ ఖదర్ దాగి ఉందని మహమ్మద్ ప్రవక్త సొల్లాహు అలైహి వసల్లం తన సహచర సహబాలకు సూచించినట్లు పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. రంజాన్ మాసంలోని చివరి పది రోజులు జహన్నంసే పనా మాంగ్‌నేకా అష్రలోనే పవిత్ర రాత్రి ఉంటుంది. అయితే ఏ రోజున అని స్పష్టత లేదు . కానీ 21, 23, 25, 27, 29 ఉపవాసదీక్షలు పాటించడం కంటే ముందు రోజు రాత్రుల్లో ఏదైనా ఒక దానిలో ఉందని, తాఖ్ రాత్ పేరుతో జాగరణ చేయాలని ప్రవక్త మహమ్మద్ బోధించారు.



విద్యుత్‌దీపాల వెలుగులో మదనపల్లెలోని మోతీనగర్ మసీదు

సతామి పండుగకు ముస్తాబైన మసీదులు

సతామి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మసీదుల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ రాత్రిలోనే దివ్యఖురాన్ పఠనం పూర్తి చేస్తారు. ప్రార్థనల అనంతరం ముస్లింల ఖబ్రస్థాన్‌లకు వెళ్లి వారి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేస్తారు. దీని కోసం ఖబ్రస్థాన్‌లు కూడా శుభ్రపరిచి విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రత్యేక ప్రార్థనలతో అధిక ఫలితం



షబే ఖదర్ రోజున జాగరణ చేసి, ఆధ్యాత్మికంగా గడపాలి. నమాజ్, తరావీహ్, నఫిల్ నమాజ్, తహజ్జుద్ వంటి ప్రత్యేక ప్రార్థనలతో అధికంగా ఫలితం లభిస్తుంది. అల్లాహ్ స్మరణతో గడిపితే వెయ్యి నెలల పుణ్య ఫలం లభిస్తుందని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. దైవదూతలంతా భూమిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించే వారికి శుభాభినందనలు తెలుపుతారు. – మౌలానా జలాలుద్దీన్, ప్రభుత్వ ఖాజీ, మదనపల్లె.

సకల పాపాల ప్రక్షాళన



రంజాన్ మాసంలో షబేఖదర్ పేరుతో జాగరణ చేస్తూ ప్రార్థనలు చేస్తే సకల పాపాలు తొలగిపోతాయి. ఈ రాత్రి అల్లాహ్ అందించిన పెద్దకానుక. ఈ రాత్రే ఖురాన్ భూమి మీదకు అవతరించింది. ప్రతి ముస్లీం బడీరాత్ రోజున ఆధ్యాత్మికంగా గడిపి అల్లాహ్ కరుణకు దగ్గరవ్వాలి. – ఆరీఫ్ ఖాదర్‌మొహిద్దీన్, ఉస్మాన్ నగర్, రాజంపేట

జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి జ్యోతి క్షేత్రం సమస్య



జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్సీ బృందం

పోరుమామిళ్ల : ఇటీవల అత్యంత చర్చనీయాంశంగా మారిన కాశినాయన జ్యోతి క్షేత్రంలో నిర్మాణాల కూల్చివేత గురించి బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తీసుకెళ్లి వివరించారు. ఆయన వెంట నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బి.కోడూరు మాజీ జెడ్పీటీసీ, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, గంటా రమణారెడ్డి, మేరెడ్డి రమణారెడ్డి తదితరులున్నారు. మూడు దశాబ్దాలకు పైగా కాశినాయన క్షేత్రంలో జరిగిన అభివృద్ధి, ఆగిపోయిన ఆలయ పనులు వివరిస్తూ.. హఠాత్తుగా ఫారెస్టు అధికారులు, పోలీసులు అక్కడ నిర్మాణాలు అడ్డంగా కూలగొట్టడం, భక్తుల మనోభావాలు దెబ్బతినడం తదితర అంశాలు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాజీ సీఎంకు వివరించారు. వైయస్ జగన్ సానుకూలంగా స్పందించి త్వరలో ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలసి మాట్లాడతానని చెప్పినట్లు డీసీ గోవింద రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్ కూడా కాశినాయన క్షేత్రాన్ని సందర్శిస్తానని చెప్పారన్నారు.

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి



కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), భౌతిక శాస్త్ర విభాగంలోని మెటీరియల్ ఫిజిక్స్ ప్రొఫెసర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్ర నాథ్ తెలిపారు. ఆయన పరిశోధనకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), రాష్ట్రీయ ఉత్చతార్ శిక్షా అభియాన్ (ఆర్‌యుఎస్‌ఏ) వంటి అత్యున్నత ప్రభుత్వ నిధుల సంస్థల నుంచి మద్దతు లభించిందన్నారు. ఈ సందర్భంగా, ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి. రామచంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ బి. సుధాకర్ రెడ్డిని అభినందించారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయా!

కలెక్టర్‌కు మొరపెట్టుకున్న రైతు



కర్బూజ పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ, మండల వ్యవసాయ అధికారులు

రామాపురం : నకిలీ విత్తనాల వాడకంతో నష్టపోయిన తనను ఆదుకోవాలని ఓ రైతు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్న సంఘటన మండలంలో బుధవారం జరిగింది. రామాపురం నల్లగుట్టపల్లె గ్రామంలోని ఐదు ఎకరాల పొలంలో రైతు చంచర్ల ఆంజనేయులు రాయచోటికి చెందిన రఘు అగ్రికేర్‌లో కర్బూజ పంటకు సంబంధించి విత్తనాలు రూ.29,500కు కొనుగోలు చేసి పంటను సాగు చేశాడు. పంటకు కావాల్సిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, డ్రిప్పుకు సంబంధించిన పైపులు అన్ని రూ.5లక్షలు వరకు పెట్టుబడి పెట్టి జనవరి మాసంలో పంట సాగు చేశాడు. నాసిరకం కర్బూజా కాయలు రావడంతో రఘు అగ్రికేర్ వద్దకు వెళ్లి విషయం తెలియజేశాడు. ఏజెన్సీకి సంబంధించిన సిబ్బంది పొలాన్ని పరిశీలించి, పంట సాగుకు పనికిరాదని ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేదని, పొలాన్ని వదులుకోవడం మంచిదని సలహా ఇచ్చి వెళ్లారు. పంట సాగుకోసం రూ.5లక్షలు అప్పు తెచ్చి ఖర్చు చేశానని తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నాడు. ఫిర్యాదు మేరకు లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారి, మండల వ్యవసాయ అధికారి పొలాన్ని పరిశీలించి సంబంధిత శాస్త్రవేత్తలకు నివేదిక పంపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రాయచోటి అర్బన్ : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ప్రజలతో కలసి ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. గాలివీడు మండలం తూముకుంట సోలార్ రైతులకు పంట నమోదు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ముదివీడు రిజర్వాయర్ బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 20 దళిత గ్రామాలకు స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మణి, నాయకులు హరిశర్మ, నాగరాజు, గాయత్రి, రమేష్‌బాబు, వెంకట్రామిరెడ్డి, ప్రజాతంత్ర ఉద్యమ నాయకురాలు భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవి, ఓబులమ్మ, సురేఖ, సిద్దమ్మ, సోలార్ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసై..

గొలుసు చోరీకి యత్నం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన సంగటి ప్రణయ్‌కుమార్ అనే యువకుడు చెడు వ్యసనాలకు బానిసై మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగిలించేందుకు ప్రయత్నించాడు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. బుధవారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ప్రణయ్‌కుమార్ అనే యువకుడు, చిలంకూరు గ్రామానికి చెందిన మరో మైనర్ బాలుడు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. అవసరాలకు, ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు అలవాటుపడ్డారు. ఇళ్లల్లో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారిని మాటల్లో పెట్టి వారిలో మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లి డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఈ తరుణంలోనే ఈ నెల 24వ తేదీన కడప రోడ్డులోని మహేశ్వర్‌నగర్ కాలనీలో లక్ష్మీదేవి అనే మహిళ నిర్వహిస్తున్న చిల్లర అంగడి వద్దకు వెళ్లారు. వీరిద్దరూ సిగరెట్లు, నీళ్ల ప్యాకెట్లు కావాలని అడిగారు. ఆ వస్తువులను ఇచ్చేందుకు ఆమె వెనక్కు తిరగగానే ప్రణయ్‌కుమార్ లక్ష్మీదేవి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. లక్ష్మీదేవి గట్టిగా కేకలు వేయడంతో ఇంటిలో ఉన్న ఆమె భర్త ఈశ్వర్‌రెడ్డి బయటకు వచ్చాడు. అలాగే అక్కడున్న మరికొంత మంది వ్యక్తులు రాగానే వారు ఇద్దరు పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

సమస్యలు అలా.. విస్తరణ ఎలా!

- నేడు దాల్మియా పరిశ్రమ విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ
- మెజార్టీ ప్రజల్లో వ్యతిరేకత



ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధం చేసిన ప్రాంగణం

మైలవరం : మైలవరం మండలం నవాబు పేట గ్రామం వద్ద నిర్మించిన దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ కోసం గురువారం మూడు గ్రామాల ప్రజలతో ప్రజాభిప్రాయసేకరణకు అధికారుల సిద్ధం చేశారు. ప్రస్తుతం దాల్మియా పరిశ్రమ 4.6 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం దాని పరిధిని 12.6 మెట్రిక్ టన్నులకు విస్తరణ చేయాలని దాల్మియా యాజమాన్యం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ , పర్యావరణశాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. అయితే దాల్మియా బాధిత గ్రామాలైన నవాబుపేట, దుగ్గనపల్లి ,చిన్న కొమెర్ల గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించకుండానే ప్రజాభిప్రాయ సేకరణ చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. అలాగే సిమెంటు రాయి కోసం బ్లాస్టింగ్ చేస్తున్న దాల్మియా యాజమాన్యం నిబంధనలు పాటించకుండా భారీగా పేలుడుతో రాయిని వెలికి తీస్తున్నారు. దీంతో ఆ పేలుడు ధాటికి తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని నవాబుపేట గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వస్తున్న బూడిద కారణంగా పరిసర పంట పొలాలు దెబ్బతినడంతోపాటు దిగుబడి కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చిన్న కొమెర్లనుంచి నవాబుపేట వరకు రైల్వే ట్రాక్‌వద్ద నుంచి భారీగా మట్టి కట్ట వేశారు. గతంలో వర్షాలు వచ్చినప్పుడు కిలోమీటరు వెడల్పుతో రెండు మూడు వంకల ద్వారా నీరు ప్రవహించేది. అయితే ఈ మట్టి కట్ట వేయడం వల్ల ఒక వంక నుంచే నీరు ప్రవహించి నీరు రోజుల తరబడి పొలాల్లో నిలిచిపోతోంది. గతంలో 33 వేల క్యూసెక్కుల వర్షపు నీరు వంక ద్వారా ప్రవహించేది. ప్రస్తుతం ఉన్న 8వేల క్యూసెక్కులకు మించి ప్రవాహానికి అనువుగా లేనందున దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలకు చెందిన పొలాల్లో రోజుల తరబడి నాలుగు నుంచి ఆరు అడుగుల వరకు నీరు ఉండటంతో పొలాలు సాగుకు అనుకూలంగా లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ ఇంకా విస్తరిస్తే తమ గ్రామాలకు నష్టాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని బాధిత గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. 20 రోజుల క్రితం దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే బుడిద వల్ల దిగుబడి తగ్గి, నాణ్యత లేక, పంట అమ్ముకోలేక మోషే అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సమయంలో దాల్మియా యాజమాన్యం తమ సమస్యలు పరిష్కరించకుండా విస్తరణ పనులు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీలు ఉపాధి కల్పనకు దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ వర్గానికి చెందిన వారు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీస్ ఆర్థిక సంస్థ జిల్లా కార్య నిర్వాహక సంచాలకుడు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. జిల్లాలోని ముస్లింలు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు ఈ రుణాలకు అర్హులని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా ఖాదీ బోర్డు, ఖాదీ అండ్ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ద్వారా సంబంధిత బ్యాంకుల వారితో సంప్రదించి స్కోరింగ్ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. వివరాలకు 08562-241137, 98499 01140 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, జేసీబీ సీజ్

పెనగలూరు : పెనగలూరు మండలం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. నారాయణ నెల్లూరు వద్ద సురేష్ నాయుడు ఇసుకను డంపింగ్ చేసి అక్కడి నుంచి జేసీబీ, టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే ఏపీ04యుఏ3789 అనే నంబరు గల టిప్పర్, ఏపీ39 ఎఫ్‌సి1296 అనే నెంబరు గల జేసీబీ వాహనాలను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. జేసీబీ, టిప్పర్ డ్రైవర్లతో పాటు వాహనాల యజమాని సురేష్ నాయుడుపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

సరైన వైద్యం అందక గేదె మృతి



మృతి చెందిన గేదె

పెనగలూరు : పశు వైద్యులు సరైన వైద్యం చేయకపోవడం వల్ల లక్ష రూపాయలు విలువజేసే గేదె మృతి చెందిందని పెనగలూరు గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. గత కొద్దిరోజులుగా గేదె అనారోగ్యంతో ఉండటంతో వైద్యులు వైద్యం చేశారన్నారు. అయితే సరైన వైద్యం అందించకపోవడంతో తమ గేదె మృతి చెందిందని యజమాని తెలిపాడు. గేదెకు గొంతువాపు వ్యాధికి సంబంధించి బయట నుంచి మందులు తెచ్చినా కూడా వైద్యులు ఆ మందులు వాడకుండా రేబీస్ వ్యాధికి సంబంధించిన మందులు వాడటంతోనే తమ గేదె మృతి చెందిందని ఆరోపించాడు. తమ కుటుంబ పోషణకు తోడ్పడుతున్న గేదె మృతి చెందడంతో బాధితుడి కుటుంబీకులు పశువైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పశువైద్యుడి వివరణ

పెనగలూరు గ్రామానికి చెందిన భాస్కర్‌కు చెందిన గేదె రేబీస్ వ్యాధితోనే మృతి చెందిందని ఇతర వ్యాధుల వల్ల ఆ గేదె మృతి చెందలేదని ఇన్‌చార్జి డాక్టర్ వేదవతి వివరణ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రాయచోటి రూరల్ అధ్యక్షుడిగా పోలు వెంకటసుబ్బారెడ్డి, సంబేపల్లె అధ్యక్షుడిగా ఎస్.ఉదయ్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె అధ్యక్షుడిగా ఎం.సుదర్శన్‌రెడ్డి, రామాపురం అధ్యక్షుడిగా జి.జనార్దన్‌రెడ్డి, గాలివీడు అధ్యక్షుడిగా ఎం.యదుభూషణరెడ్డిలను నియమించారు. ఎంప్లాయిస్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా దయానంద అన్నమయ్య జిల్లా ఎంప్లాయిస్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా రాజంపేట నియోజకవర్గానికి చెందిన పాలకూరు దయానంద్‌ను నియమించారు.

రేపు మైదుకూరులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు మైదుకూరు పట్టణంలోని పోరుమామిళ్లరోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చేసి ఉండాలన్నారు. 18–35 మధ్య వయస్సుగల వారు అర్హులని, హోదాను బట్టి రూ.10–18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు రావాలన్నారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి కనిపించడం లేదని కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు వివాహిత మహిళ ఆదిలక్ష్మి ఈ నెల 23 వతేదీన ఇంటిలో తాడిపత్రికి వెళుతున్నా అని చెప్పి వెళ్లింది. ఇప్పటి వరకు కనిపించలేదని ఆమె మామ వి. ఓబులేసు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

కలసపాడు : మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొత్తపల్లె రాజారెడ్డి (45) మంగళవారం రాత్రి శంఖవరం, లింగారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాజారెడ్డి తన సొంత పని నిమిత్తం పోరుమామిళ్లకు తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా టేకూరుపేటకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై లింగారెడ్డిపల్లెకు వెళుతూ శంఖవరం, లింగారెడ్డిపల్లె గ్రామాల మధ్యలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి భార్య సుధాదేవి, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.